క్లుప్తంగా

ఆడపిల్లలపై లింగ వివక్ష చూపరాదు



పెనమలూరు: ఆడపిల్లల పట్ల లింగ వివక్ష చూపరాదని వణుకూరు గ్రామం పంచాయతీ కార్యదర్శి వీ పద్మావతి అన్నారు. మండల పరిధిలోని వణుకూరు, గోసాల, గంగూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఆడపిల్లల పట్ల లింగ వివక్షత – అసమానతలు అనే అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు ఒకే భావనతో ఉండి ఆడపిల్లలు, మగ పిల్లలు అనే తేడా లేకుండా చూడాలన్నారు. నేడు ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమలో మహిళా సంరక్షణ కార్యదర్శిలు డీ వికల్ప, సుధారాణి, జీ విజయలక్ష్మి, తబిత, ఎం.జ్యోతి, టీ లిఖిత, కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణ అందరి బాధ్యత

కంకిపాడు: హెచ్‌ఐవీ నియంత్రణ అందరి బాధ్యత అని కళాజాతా బృందం పేర్కొంది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పునాదిపాడు గ్రామంలో హెచ్‌ఐవీ, లెప్రసీ నియంత్రణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడివాడకు చెందిన యడవల్లి వీరయ్య కల్చరల్ సొసైటీ బృందం కళాకారులు వీధి నాటికల ద్వారా హెచ్‌ఐవీ, రక్తదాన శిబిరాలు, ఏఆర్‌టీ కేంద్రాల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో గైడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ప్రాజెక్టు మేనేజర్ సుజాత, ఔట్రీచ్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన ర్యాలీ



కంకిపాడు: రక్తహీనత సమస్యను కిశోర బాలికలు అధికమించాలని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ కేబీ సుకన్య అన్నారు. కంకిపాడు పట్టణంలోని ఏడవ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో కిశోర వికాసంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి సీడీపీఓ సుకన్య మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడే బాలికలు ఆకుకూరలు, డ్రైఫ్రూట్స్, చిరుధాన్యాలు ఉండే పోషకాహారాన్ని అధికంగా తీసుకోవాలన్నారు. పోక్సో చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ప్రాజెక్టు కార్యాలయ ఎల్‌పీఓ శైలజ సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్ అన్నామణి, ఏఎన్‌ఎం సుజాత, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, ఆశ కార్యకర్త పార్వతి పాల్గొన్నారు.

రేపు ఇంద్రకీలాద్రిపై హనుమత్ జయంతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈనెల 22వ తేదీ హనుమత్ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శీనానాయక్ తెలిపారు. ఘాట్‌రోడ్డులోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో, పాత మెట్ల మార్గంలోని ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి పంచామృత అభిషేకాలు, నాగవల్లీ దళార్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

రాయితీపై పశువులదాణా పంపిణీ



కంకిపాడు: సమీకృత దాణాతో పశుపోషణ లాభదాయకంగా మారుతుందని కంకిపాడు పశువైద్యాధికారి డాక్టర్ జీ రవి పేర్కొన్నారు. స్థానిక పశు ఆరోగ్య కేంద్రంలో 50 శాతం రాయితీపై పశుపోషకులకు సమీకృత పశుదానాను ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవితో కలిసి మంగళవారం ఆయన పంపిణీ చేశారు. డాక్టర్ రవి మాట్లాడుతూ రాయితీ పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుపోషణలో మెళుకువలు పాటిస్తే లాభాలు మెండుగా ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

24న ఆర్టీసీ బస్టాండ్‌లో వేలంపాట

గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని ఖాళీ స్థలాలను అద్దెకు ఇచ్చేందుకు ఈనెల 24వ తేదీన వేలంపాట నిర్వహిం నున్నట్లు డిపో మేనేజర్ పీ శివాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బస్టాండ్ ఆవరణలోని టేకు, వేప, గానుగ, దరిశనం, తంగేడు చెట్ల విక్రయం నిమిత్తం కూడా వేలం జరుగుతుందని చెప్పారు. డిపో ఆఫీస్ వద్ద సాయంత్రం మూడు గంటలకు జరిగే వేలంలో ఆసక్తి కలిగిన వ్యక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

నిడమానూరు రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత

- అరకొర వసతులతో ప్రయాణికుల అవస్థలు
- ఆకతాయిలకు అడ్డాగా మారిన వైనం



నిరుపయోగంగా ఉన్న తాగునీటి కుళాయిలు



నిడమానూరు రైల్వేస్టేషన్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు రైల్వేస్టేషన్‌లో అరకొర వసతులతో ప్రయాణికులకు అవస్థలు పడుతున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ స్టేషన్‌లో సరైన సదుపాయాలు లేక ప్రయాణికులు అల్లాడుతున్నారు. విజయవాడ రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఈ స్టేషన్‌లో పరిస్థితులను చూసి ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిడమానూరు గ్రామంతోపాటు చుట్టు పక్కల గ్రామాల వారు తమ గమ్యస్థానాలకు రాకపోకలు సాగించే నిమిత్తం ఈ స్టేషన్‌పై ఎక్కువ ఆధారపడి ఉన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, కూలీల రాకపోకలతో ఉదయం, సాయంత్రం ఈ స్టేషన్ హడవుడిగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న నిడమానూరు రైల్వేస్టేషన్‌లో మాత్రం వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

అలంకారప్రాయంగా మరుగుదొడ్లు

ఈ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కూడా అందడంలేదు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్ల వసతులు నామమాత్రంగా మారడంతో ప్రయాణికులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. పైగా ఈ స్టేషన్‌కు వెళ్లే మార్గంలోనే బహిరంగ మలమూత్ర విసర్జనలు చేస్తుండటంతో ముక్కుమూసుకుని స్టేషన్‌కు రావాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. స్టేషన్‌లోని మరుగుదొడ్లను ఎప్పుడు చూసిన తాళాలు వేసి ఉంచుతున్నారు. ఫలితంగా కాలకృత్యాలు తీర్చుకోవాలంటే స్టేషన్ బయట బహిరంగ ప్రదేశాలపైనే ప్రయాణికులు ఆధారపడుతున్నారు. దీంతో మహిళలు, చిన్నారులతోపాటు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఫ్లాట్‌ఫాంలపై ఉన్న కుళాయిలు అలంకారప్రాయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఈ స్టేషన్‌లో తాగునీరు కూడా అందడం లేదు. మరమ్మతులకు గురైన కుళాయిలు కొన్నయితే, మరికొన్నింటిలో తాగునీరు రావడం లేదు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కనీస సౌకర్యాలను స్టేషన్‌లో కల్పించాలని ప్రయాణికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



స్టేషన్‌లో తాళాలు వేసిన మరుగుదొడ్లు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

గ్రామంలోని రైల్వేస్టేషన్ ఆకతాయిలకు అడ్డాగా మారుతోంది. ఈ స్టేషన్ పరిసరాలు నిర్మానుష్యంగా ఉండటంతో రాత్రుళ్లు ఆకతాయిలు, మందుబాబులు ఇక్కడకు చేరుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఆటోలు, ద్విచక్రవాహనాలపై ఇక్కడకు చేరుకుని మద్యం, గంజాయి సేవించడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మద్యం సేవించి ఖాళీ బాటిళ్లు రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలోనే పడేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. గతంలో మందు బాబులు వారిలో వారు గ్రూపులుగా విడిపోయి గొడవలకు కూడా పాల్పడ్డారని గుర్తు చేస్తున్నారు. ఇటువంటి ఘటనలు తరుచూ జరుగుతున్నాయని, రాత్రుళ్లు రైలు దిగి స్టేషన్ నుంచి రోడ్డుపైకి రావాలంటే భయంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో రాత్రుళ్లు పోలీసులు గస్తీ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలంలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాయితీపై రుణాలు పొందేందుకు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఇ. సత్యకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్ కింద దరఖాస్తు చేసుకునేందుకు ముస్లిం, సిక్కు, బుద్దిష్ట్, పర్సిస్, జైన్స్, క్రిస్టియన్లు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఏపీ ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

విలేజ్ సర్వేయర్ల బదిలీలకు రంగం సిద్ధం

విజయవాడరూరల్: గ్రామ సచివాలయాల్లో విలేజ్ సర్వేయర్లుగా పనిచేస్తున్న వారిని బదిలీ చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఒకే చోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న సర్వేయర్లను తప్పని సరిగా బదిలీ చేయడం జరుగుతుందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో విజయవాడ రూరల్ మండలంలోని 32 మంది విలేజీ సర్వేయర్లలో 24 మందిని ఏపీ సచివాలయం(వెలగపూడి)లోని వివిధ శాఖలకు బదిలీ చేయడానికి ప్రాథమిక సమాచారం పంపింది. ప్లానింగ్, ఫైనాన్స్, వ్యవసాయశాఖ, రెవెన్యూ, వెల్ఫేర్ శాఖల్లోకి బదిలీ చేస్తున్నారు. గతంలో ప్రతి సచివాలయంలో ఒక విలేజీ సర్వేయర్ ప్రజలకు అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో మూడు సచివాలయాలకు ఒక సర్వేయర్ మాత్రమే ఉంటారు.

పుస్తక పఠనంతో ప్రగతి సాధ్యం



పురుషోత్తపట్నంలో నీతి కథలు చెబుతున్న విద్యార్థులు



తెన్నేరు గ్రంథాలయంలో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

గన్నవరం రూరల్: పుస్తక పఠనంతోనే ప్రగతి సాధ్యమని ముస్తాబాద శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కే జ్యోతికుమారి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులచే పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం పుస్తకాలు చదవాలని, సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించి విజేతలను అభినందించారు. అలాగే పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు కథలు చెప్పారు. పలువురు పాఠకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై శిక్షణ

కంకిపాడు: వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా కంకిపాడు శాఖా గ్రంథాలయంలో మంగళవారం పుస్తక పఠనంపై శిక్షణ ఇచ్చారు. పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలను వక్తలు వివరించారు. అలాగే క్యారమ్స్, చెస్‌లో ప్రత్యేక శిక్షణ అందించారు. శిక్షణ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ, ఉపాధ్యాయురాలు ఎం పద్మ పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పఠనం, ఆటల పోటీలు నిర్వహించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్ సునీత పర్యవేక్షించారు.

సచివాలయాల్లో బదిలీల ఫీవర్

సిఫార్సుల కోసం ఉద్యోగుల పరుగు



సచివాలయ భవనం

పెనమలూరు: గ్రామ, వార్డు సచివాలయాల్లో బదిలీ మేళా మొదలైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సిబ్బంది నియమించారు. ఇప్పటికి వారి సర్వీసు ఐదేళ్లు పూర్తి కావడంతో బదిలీలు చేపడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో సచివాలయాల్లో బదిలీల హడావుడి నెలకొంది.

30 సచివాలయాల్లో స్థానచలనం

మండల పరిధిలో 30 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. పెనమలూరు మండలంలో 11, తాడిగడప మున్సిపాలిటీలో 19 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో సచివాలయ కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శి, ఏఎన్‌ఎం, విలేజ్ సర్వేయర్, వీఆర్వో, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం సచివాలయాల ఉద్యోగులకు ఐదేళ్ల సర్వీసు ఒకే సచివాలయంలో పూర్తి అయినందున బదిలీలు అనివార్యంగా మారాయి. తాడిగడప మున్సిపాలిటీలో 176 మందికి, పెనమలూరు మండలంలో 70 మంది సచివాలయాల ఉద్యోగులకు బదిలీ ఫీవర్ తగలడంతో పరుగులు తీస్తున్నారు.

సిఫార్సు అనివార్యం..!

సచివాలయాల్లో కష్టపడి పని చేసే వారికి గుర్తుంపు మాట ఎలా ఉన్నా బదిలీల్లో మాత్రం సిఫార్సు లెటర్ అనివార్యంగా మారిందని చెబుతున్నారు. టీడీపీ చోటామోటా నేతల ద్వారా సిఫార్సు చేయించుకుంటున్నారు. పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీలోనే ఉండే విధంగా పైరవీలు చేయించుకుంటున్నారు. సచివాలయ ఉద్యోగులను ఎవరిని ఎక్కడ వేయాలనేది ఆయా గ్రామాల టీడీపీ నేతలు పైరవీలు చేస్తున్నారని సమాచారం. బదిలీల తుది జాబితాకు ఆమోద ముద్ర పడాల్సి ఉందంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో మెరి ట్, రిజర్వేషన్ ఆధారంగా పోస్టులు పొంది ఉద్యోగాల్లో చేరిన సచివాలయ ఉద్యోగులు నేడు బదిలీల కోసం నానాహైరానా పడుతుండటం విశేషం.

తాడిగడపలోనూ బదిలీలు

తాడిగడప మున్సిపాలిటీలో ఉద్యోగులకు కూడా బదిలీల ఫీవర్ పట్టుకుంది. కమిషనర్ నుంచి దిగువ స్థాయి ఉద్యోగులు స్థానచలనం కలిగే అవకాశం కనబడుతోంది. ఎవరికి వారు రికమండేషన్ లెటర్‌లతో పైరవీలు చేసుకుంటున్నారని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బదిలీల జీవో సామాన్య ఉద్యోగులకు గుదిబండగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కార్మికుల హక్కులు కాపాడాలి



పోరంకిలో నిరసన ర్యాలీ చేస్తున్న ఆశలు, కార్మికులు



గన్నవరంలో తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

పెనమలూరు: కార్మికులకు శాపంగా మారిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి వారి హక్కులు కాపాడాలని కోరుతూ తాడిగడప మున్సిపాలిటీ పోరంకిలో కార్మికులు, ఆశలు, అంగన్‌వాడీలు మంగళవారం నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల కోసం ప్రభుత్వం లేబర్ కోడ్‌లు అమలులోకి తీసుకువచ్చిందని ఆరోపించారు. కార్మికులను కట్టుబానిసలుగా మార్చాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు విధానం రద్దు చేసి కార్మికులను, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. అలాగే తాడిగడప మున్సిపాలిటీ వర్కర్లకు కమిషనర్ భవానీప్రసాద్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన ర్యాలీలో వై లక్ష్మీప్రసన్న, బాణావత్‌రాణి, సుజాత, అక్కిదాసరి డేవిడ్, వెంకటరెడ్డి, పీ సత్యనారాయణ, కంచర్ల పద్మ, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో..

గన్నవరం: కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ, పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి, కొత్తగా లేబర్ కోడ్లను తీసుకురావడం దుర్మార్గమన్నారు. అనంతరం తహసీల్దారు కేవీ శివయ్యకు వినతిపత్రం సమర్పించారు. ప్రజాసంఘాల నేతలు సూరగాని సాంబశివరావు, మల్లంపల్లి ఆంజనేయులు, బెజవాడ తాతబ్బాయి, మిరప నాగేశ్వరరావు, శివచారి, గణేష్, సాంబ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌లో...

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ మెయిన్ సెంటర్, ప్రధాన రహదారుల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు బేతా శ్రీనివాసరావు, నల్లి ఆంజనేయులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

గన్నవరం: కార్మికుల సమస్యలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉంగుటూరు గ్రామసచివాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా వచ్చేనెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు వెంకటేశ్వరరావు, రామరాజు, సాంబశివరావు, సుబ్బారెడ్డి, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పెనమలూరు: గోసాల గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పఠాన్‌బాజీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి వైఎస్సార్ సీపీ మంగళవారం ఆర్థిక సాయం అందించింది. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ కన్వీనర్ దేవభక్తుని చక్రవర్తి రూ. 10 వేలు సొమ్ము ఇవ్వగా గ్రామ పార్టీ కన్వీనర్ పోలవరకు రవి, ఉప సర్పంచి ఎండీ దాదా ఆర్థిక సాయాన్ని మృతుడి భార్య పఠాన్ రేష్మికి అందజేశారు.

హనుమత్ జయంతికి ఆలయాలు ముస్తాబు



పురుషోత్తపట్నంలో అభయాంజనేయస్వామి ఆలయం

గన్నవరం రూరల్: మండలంలోని ఆంజనేయస్వామి దేవాలయాలు హనుమత్ జయంతికి ముస్తాబు అయ్యాయి. చిక్కవరం శ్రీసూర్య ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం అష్టోత్తర పూజలు, భజన సత్సంగాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకుడు చిట్టినేని వంశీ మంగళవారం తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. పురుషోత్తపట్నం అభయాంజనేయస్వామి దేవాలయం హనుమత్ జయంతికి ముస్తాబు అయ్యింది. అర్చకుడు కొండవీటి హరిశ్చంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం విశేష పూజలు జరుగుతాయని నిర్వాహకుడు సుంకర శివ రామకృష్ణ తెలిపారు.

అంతర్గత రహదారుల్లో నిలిచిన వర్షంనీరు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కురిసిన వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లోని కాల్వగట్టు ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరుకుంది. రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతాలు, ప్రధాన గ్రామంలోని పలు అంతర్గత రహదారులు, ప్రసాదంపాడులో రైల్వేస్టేషన్ కట్ట ప్రాంతం, లోతట్టు ప్రాంతాలు, ఎనికేపాడులో శివాలయం పల్లాలు, విజయ ఆగ్రో కట్ట, నిడమానూరు రామానగర్, కాల్వగట్టు ప్రాంతాల్లోని పలు రహదారుల్లో వర్షంనీరు నిలిచింది. ఆయా గ్రామాల్లోని డ్రెయిన్లు పొంగి మురుగునీరు సరఫరాకు ఆటంకంగా మారాయి. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారుదలకు నోచుకోని డ్రెయిన్లు పూడుక తీయించాలని, అంతర్గత రహదారులను అభివృద్ధి పరచాలని ఆయా గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించాలి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి దేవస్థానానికి చెందిన వసతి గృహాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు భక్తులకు మరిన్ని సదుపాయాలను కల్పించాలని ఆలయ ఈవో శీనానాయక్ ఆదేశించారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన కాటేజీలు, వసతి గృహాలు, గుణదల క్వార్టర్స్, పోరంకిలోని వేద పాఠశాలలను మంగళవారం ఆయన పరిశీలించారు. తొలుత వన్‌టౌన్‌లోని మాడపాటి అతిథి గృహానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రూమ్ బుక్ చేసుకోవాలంటే ఆన్‌లైన్‌లోనే చేసుకోవాలని సిబ్బంది ఈవోకు వివరించారు. వసతి గృహాల్లో భక్తులకు అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి ఆరా తీశారు. చిన్న చిన్న రిపేర్లు, విద్యుత్ మరమ్మతు పనులను తక్షణమే చేపట్టాలని ఈఈ కోటేశ్వరరావుకు సూచించారు. అనంతర సీవీ రెడ్డి చారిటీస్ కాటేజీలను పరిశీలించారు. గుణదలలోని దేవస్థాన సిబ్బంది క్వార్టర్స్‌ను పరిశీలించిన క్రమంలో నిరుపయోగంగా ఉన్న క్వార్టర్స్, కట్టడాల గురించి ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నగరం నడిబొడ్డున ఉన్న విలువైన స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాలని సూచించారు. అనంతరం పోరంకిలో వేద విద్యార్థులు విద్యనభ్యసించే దేవస్థాన వేద పాఠశాలను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు... వారి దినచర్య ఏంటని సిబ్బందిని ప్రశ్నించారు. దేవస్థానానికి ఉన్న కాటేజీలు, వనరులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఈవో తెలిపారు. ఈవో వెంట పలువురు ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరు పూర్వ కార్యదర్శిపై అభియోగాలు

పెనమలూరు: పెనమలూరు గ్రామ పంచాయతీలో పూర్వ కార్యదర్శిగా పని చేసి ప్రస్తుతం చినఓగిరాల కార్యదర్శిగా పని చేస్తున్న ఎ.సుబ్బారావు నిధులు దుర్వినియోగం చేశాడని డిజిటల్ పంచాయతీ అధికారిణి సంపత్‌కుమారి విచారణలో తేల్చారు. వివరాల్లోకి వెళితే.. పెనమలూరు గ్రామానికి చెందిన ముప్పాళ్ల బద్రీనారాయణ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో జిల్లా పంచాయతీ అధికారి విచారణకు ఆదేశించారు. గతంలో పెనమలూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేసి అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన ఎం.రాధాకృష్ణ నుంచి చార్జ్ తీసుకోకుండా గ్రామపంచాయతీ నిధులు సుబ్బారావు నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేసినట్లు బద్రీనారాయణ ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారించిన డీఎల్‌పీవో నిధులు దుర్వినియోగం జరిగినట్లు ధృవీకరిస్తూ డీపీవోకు నివేదిక ఇచ్చారు.

ఉచిత వైద్య శిబిరం



అసోసియేట్ డీన్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో మంగళవారం నెఫ్రాలజిస్ట్ డాక్టర్ బీ వరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కిషోర్ ప్రారంభించారు. అనంతరం కళాశాలలో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులకు హైపర్‌టెన్షన్ స్క్రీనింగ్, రక్తపరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు బీపీ పరీక్షల నిమిత్తం స్ఫిగ్మోమానో మీటర్‌ను వరుణ్‌కుమార్ ఉచితంగా అందజేశారు. అనంతరం రక్తపోటు అదుపులో ఉంచుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జీవనశైలిని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య బృందం వివరించింది. పలువురు కళాశాల విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడు మృతి

పెనమలూరు: పోరంకిలో భవన నిర్మాణ కార్మికుడు భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. విజయవాడ విజయదుర్గానగర్‌కు చెందిన చింతా దుర్గారావు(40) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తాడు. అతను సోమవారం పోరంకి వెంకటాపురంకాలనీలోని భవనం రెండవ అంతస్తులో పని చేస్తుండగా ఫిట్స్ వచ్చి ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో దుర్గారావును విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర వైద్యం కోసం చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అతను అదే రోజు మృతిచెందాడు. ఈ ఘటనపై తండ్రి చింతా శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

పోరంకి వద్ద రోడ్డు ప్రమాదం

పెనమలూరు: పోరంకి వద్ద బందరు రోడ్డుపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అయ్యాయి. మచిలీపట్నం నుంచి విజయవాడ వైపునకు వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు పోరంకి ఎల్‌ఎన్ గార్డెన్స్ వద్ద ఎదురుగా వెళుతున్న బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చున్న మహిళ రోడ్డుపై పడిపోవడంతో గాయాలు అయ్యాయి. బాధితురాలి వివరాలతో పాటు ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.